

# వాన కురిసిన రాత్రి

ద్వాభాష్యం రాజేశ్వరరావు

నేను ముత్యపు చిప్పను కాను!

నాకు ఆనందం కలిగించటానికి స్వాతి చినుకే అక్కరలేదు!

వాన చినుకులు ఎప్పుడు నింగి నుండి రాలినా నాకిష్టమే!

నల్లని మబ్బులనుండి పూసల దండల్లా, చినుకులు పడుతూవుంటే చూడటానికి నాకు ఎంతో ఆహ్లాదంగా వుంటుంది. మట్టిమీద చినుకులు పడిన

తరువాత గాలి మోసుకొచ్చే వింత పరిమళమంటే నాకు ఎంతో ఇష్టం. చీకటిసుందరి పెరటి మీద చిరునవ్వులా వెలిగి మాయమయ్యే మెరుపులు చూడటంలో నాకు అమితమైన తృప్తి లభ్యమవుతుంది.

వాన కురుస్తున్నపుడు గదిలో కూర్చుని వెచ్చగా సిగరెట్టు పీలుస్తూ కథలు వ్రాయటం నాకు ఒక హాబీ లాంటిది.

కాని రెండు సంవత్సరాల క్రితం జరిగిన ఆ సంఘటన నన్ను పూర్తిగా మార్చివేసింది. ఇపుడు వర్షం కురుస్తూ వుంటే ఆ నాటి దృశ్యమే నా కళ్ల ముందు ప్రత్యక్షమౌతుంది, నా పాపాన్ని, కుటిలత్వాన్ని, స్వార్థాన్ని ఎత్తిచూపి ఎగతాళి చేస్తూ వుంటుంది ఈ నాటికీ ఆ సంఘటన! ఇపుడు వర్షం కురుస్తూ వుంటే ఆ మేఘాలెవరో బాధగా మూల్గుతున్నట్లు, రాక్షసి ప్రసవ వేదనను అనుభవిస్తున్నట్లు అనిపిస్తుంది. కొన్నికోట్ల గొంతులు వెక్కి వెక్కి ఏడుస్తూ వుంటే ఆ కన్నీరే వర్షం కురుస్తున్నట్లు బాధపడతాను.

• • •

రెండు సంవత్సరాల క్రితం ఆ రాత్రి !....

కాటుకలా నల్లని మబ్బులు నింగిని ఆక్రమించుకొన్న రాత్రి - చెట్లను నేల కూల్చేలా ప్రచండ వేగంతో గాలి వీచినరాత్రి - ఏనుగుతొండలాటి ధారలతో వర్షం కురిసిన రాత్రి - ఆ రాత్రి, నాకు బాగా జ్ఞాపకం!

గది తలుపులు బిగించి, కుర్చీలో కూర్చుని, కాళ్ళు టేబిలు మీద పెట్టి, సిగరెట్లు అగ్గిపుల్లల్ని వేస్టు చేసుకుండా కాలుస్తూ రాచకొండ విశ్వనాథశాస్త్రి గారి "మంచి చెడ్డలో ఏకథ?" చదవటం పూర్తిచేసి ఆలోచనలో పడ్డాను! ఆ కథలో రెండు భాగాలున్నాయి. మొదటిది 'మంచి' రెండోది 'చెడ్డ'! ఆ రెండూ గొప్ప కథలే! ప్రతి మనిషిలోనూ ఆలోచనను రేపుతాయి! "అయితే, ఆ రెండిటిలో మీకు ఏది ఎక్కువ ఇష్టమో." చెప్తే మీ స్వభావం కొంత వరకూ వెల్లడవుతుందని నా అభిప్రాయం!" అంటూ చివరన ఒక ప్రశ్న వేశారు రచయిత. ఎంతసేపు యోచించినా వాటిలో దేనిని నేను ఎక్కువ ఇష్టపడ్డానో తేల్చుకోలేకపోయాను! కాని ఇప్పుడు అనిపిస్తోంది. "వాటిలో నాకు రెండో భాగమే ఎక్కువగా నచ్చిందని."

ఆ ఆత్మపరీక్షా సమయంలో తలుపు దబదబా బాదిన చప్పుడయింది. లేచి వెళ్ళి తలుపు తీశాను. వర్షపు జల్లు ఒక్కసారి మొహాన కొట్టింది! ఆ మాసపంచూ తడిసి ముద్దయిన ఆకారం, జగన్నాథం గదిలోకి వచ్చేడు.

జగన్నాథం నాతోటి గుమాస్తా! ఒక్కసారి మీరు వాడిని చూస్తే 'పిం

నన్ను చూడగానే జగన్నాథం కంట్లో నీళ్లు చిప్పిల్లాయి.

"కూర్చోక ఏం చెయ్యను? నేను అసమర్థుణ్ణి. దరిద్రుణ్ణి! ఎందుకూ పనికిరాని వాడిని! నాలాంటి వాడిని భగవంతుడు ఎందుకు పుట్టిస్తాడు? లోకంలోని నిర్భాగ్యపు గుమాస్తాలందరూ కలిసి దేవుడిమీద తిరగబడితే ఎంత బాగుంటుంది?

మూడు దినాలనుండి నా భార్యకు జ్వరం! నిన్న సాయంత్రం పరిస్థితి మరీ విషమించింది. డాక్టరు నీరు కార్చేసి విశాఖపట్నం పెద్దాసుపత్రికి తీసుకు వెళ్ళిపొమ్మన్నాడు. నా దగ్గర చిల్లిగవ్వకూడాలేదు. ఎవరి దగ్గరా నయాపైసకూడా అప్పు పుట్టలేదు. ఇంక అప్పు చెయ్యనక్కరలేదులే! దీన్ని పైకి తీసుకెళ్ళనక్కరలేదు! పిడికెడు బుగ్గి చేస్తే చాలు! నా భార్య - నా దారిద్ర్యానికీ అసమర్థతకూ బలి అయిన భార్య. లోపల మంచంమీద అత్యంత ప్రశాంతంగా నిద్రపోతోంది చూడు!"

మాటలు ఆపి బిగ్గరగా, వికృతంగా నవ్వుతున్నాడు జగన్నాథం.

అలా నవ్వుతూ వుంటే వాడిలో నుండి ఏదో భయంకరమయిన భూతం వచ్చి నాజుట్టు పట్టుకొని పీకుతున్నట్లు అనిపించింది. నా గుండెల్లో దడ, కాళ్ళలో వణుకు ప్రారంభమయ్యాయి.

"నిన్నరాత్రి జగన్నాథానికి డబ్బు ఇచ్చి వుంటే ...?" మరి ఆలోచించలేకపోయాను.

జేబులోని నోట్లు గొంగళీ పురుగుల్లా మారి ఒంటిమీద పాకుతున్నట్లనిపించింది.

"ఈ డబ్బు వుంచు! తరువాతి పనులకు పనికొస్తాయి" అంటూ జేబులోని పురుగుల్లాంటి నోట్లను తీసి వాడిమీదకు విదిల్చాను.

బరువు తగ్గటంతోపాటు నా మనసులోని దావాగ్ని హెచ్చవుతోంది.

నాలోని కుటిలత్వాన్ని, స్వార్థాన్ని ఈ డబ్బు నీ కడగలేదు.

దుఃఖపు హోరులో ఎవరో ఏడుస్తున్నట్లుంది.

• • •

---

★ ఒక ధనవంతుడి దగ్గరకు డాక్టరును పిలిపించారు. డాక్టరు ఉత్సాహంగా- ఏమిటండీ మిమ్మల్ని బాధిస్తోంది?

ధనవంతుడు: "అది మీరే కనుక్కోవాలి. నేను చెప్పటం ఎందుకు?"

డాక్టరు: అయితే ఒక్క గంట ఆగండి. నా స్నేహితుడు ఒకడు పశువుల వైద్యుడున్నాడు. నాకు తెలిసినంతమటుకు ఆయనొక్కడే ప్రశ్నలు వేయకుండా రోగం కనుక్కోగలడు.